క్లుప్తంగా

వైభవంగా కామేశ్వరమ్మతల్లి పండగ



వర్షంలోనూ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

మాకవరపాలెం: రాచపల్లిలో కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఏటా మాదిరిగానే నిర్వహించిన ఈ పండగ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి సైతం పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా దర్శనానికి క్యూ కట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు కె.జె.పురంలో వాసవీమాత జయంతి



మాడుగుల రూరల్: వాసవీమాత జయంతిని పురస్కరించుకుని శనివారం కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనాథు శేఖర్ గురువారం తెలిపారు. మాజీ సర్పంచ్ పాలకుర్తి ఆదినారాయణ(మైనర్) కుటుంబ సభ్యులు సహకారంతో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీనాథు మల్లన్న కుటుంబ సభ్యులు మజ్జిగ వితరణ చేస్తారన్నారు. వాసవీమాత కుటుంబ సభ్యులు హాజరు కావాలని కోరారు.

19న ఎం. కోడూరులో మోదకొండమ్మ జాతర

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో ఈ నెల 19న మోదకొండమ్మ జాతర ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతర రోజున అమ్మవారిని పట్టువస్త్రాలు, వెండి ఆభరణాలతో అలంకరించి నెల రోజుల పాటు జాతర నిర్వహిస్తామన్నారు. ఈ నెల 18న 101 కాగడాలు, డప్పులు, వాయిద్యాలతో మందుగుండు సామగ్రి కాల్పులు, కామిని వేషాలు, ఏనుగుల ఊరేగింపుతో తోల్లేల జాతర నిర్వహిస్తామన్నారు. అదే రోజు భామా కళాపం పౌరాణిక నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు. జాతర రోజు సాయంత్రం అమ్మవారి ప్రభ ఊరేగింపు, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

18 నుంచి వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు

మాడుగుల రూరల్: స్థానిక వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతాయని కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు నున్న శ్రీనివాసచార్యులు, ఆరవల్లి రఘునాథచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

19న లక్ష తులసీ పూజ



పూజలకు సిద్ధమైన వేంకటేశ్వర దేవాలయం

రోలుగుంట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 19న లక్ష తులసీ పూజా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దివంగత ముత్యాల రామస్వామి కుమారులు తెలిపారు. ఆలయం వద్ద ఆదివారం ఉదయం 6 గంటలకు స్వామివారి పురాతన శిలా విగ్రహానికి పంచామృతాభిషేకం, నీరాజనం, 8 గంటల నుంచి లక్ష తులసీ పూజ భక్తుల బృందాలతో నిర్వహిస్తామన్నారు. వంద మంది భక్తులతో సహస్రనామార్చన చేస్తామన్నారు. 20 మంది ఒక బృందంగా ఈ పూజలు నిర్వహిస్తామని అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు తెలిపారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.25, టమాటా, బంగాళాదుంప రూ.30, బెండకాయ, వంకాయ రూ.40, క్యారెట్, బీట్రూట్, కాకరకాయ రూ.60, బీరకాయ రూ.80కి విక్రయాలు సాగాయి.

డెంగ్యూ జ్వరాలపై అప్రమత్తత



దేవరాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి వనజ, తదితరులు

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు

దేవరాపల్లి: డెంగ్యూ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డి. వనజ ప్రజలకు సూచించారు. ఈ మేరకు దేవరాపల్లిలో డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వనజ మాట్లాడుతూ వారానికొక రోజు నీటి నిల్వ పాత్రలను ఖాళీ చేసి డ్రై డే పాటించాలని సూచించారు. తద్వారా డెంగ్యూను అరికడదామన్నారు. డెంగ్యూ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు సహకరించాలని కోరారు. దోమలు పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డెంగ్యూ జ్వరం లక్షణాలు, డెంగ్యూ వ్యాప్తి చెందే విధానంపై వివరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా, లార్వా వృద్ధి చెందకుండా జాగ్రత్తపడాలని సూచించారు. సీహెచ్‌వో పి. ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెల్త్ అసిస్టెంట్లు సిహెచ్. కృష్ణ, గోవిందరావు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: డెంగ్యూ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలగి ఉండాలని వైద్యాధికారి శ్యామ్‌కుమార్ తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ వ్యాధికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని, వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని తెలిపారు. ఇంటి వద్ద నిల్వ నీరు ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెంది ఈ వ్యాధి ప్రబలుతుందన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీ ఉద్యోగులతో కలసి వైద్యులు ధనలక్ష్మి, శ్రావణి ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా హనుమాన్ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ర్యాలీలో దోమల నియంత్రణ మనందరి బాధ్యత, దోమ పుట్టరాదు–దోమ కుట్టరాదు, దోమతెరలు వాడండి – దోమకాటు నివారించండి, దోమలను నిర్మూలిద్దాం– దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం అంటూ పలు నినాదాలు చేశారు. దోమకాటు వల్ల వచ్చే డెంగ్యూ తదితర వ్యాధుల గురించి వైద్యులు వివరించారు. ఎంపీహెచ్ఈవో కృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ సాజహాన్, ఉద్యోగులు పాల్గొన్నారు.



గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



రోలుగుంట ఆరోగ్య కేంద్ర ఉద్యోగులతో ర్యాలీ చేస్తున్న వైద్యులు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



సాగరంలో వరి నారు మడులకు దుక్కులు చేస్తున్న రైతు

మాడుగుల: మండలంలో రెండు మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ముందుగా వేసవి దుక్కులు చేస్తున్నారు. 20 వేల ఎకరాల్లో అపరాలతోపాటు, చెరకు, వరి తదితర పంటలు పండించడానికి సిద్ధమవుతున్నారు. ఆర్బీకేల్లో పచ్చిరొట్ట ఎరువులకు నమోదు చేసుకుంటున్నారు. ఖరీఫ్ వరి సాగుకు నారు మడులు సిద్ధం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు ఖరీఫ్ విత్తనాలు సరఫరా చేయడానికి సిద్ధం అవుతున్నారు.

ఖరీఫ్‌కు వరి నారుమడులు సిద్ధం

రోలుగుంట: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో వరి నారుమడుల కోసం దుక్కులు దున్నుతున్నారు. ఖరీఫ్ వరినాట్లు అనంతరం అపరాలు సాగు చేశారు. తర్వాత పంట భూములను ట్రాక్టరుతో దుక్కులు చేస్తున్నారు. కొమరవోలు, రోలుగుంట, కంచుగుమ్మల, రత్నంపేట, కె. నాయుడుపాలెం, తదితర గ్రామాల్లో రైతులు ఖరీఫ్ వరినాట్లు వెయ్యడానికి గాను ముందుగా నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల చెరకు దవ్వనాట్లు వెయ్యడానికి గాను వేసవి దుక్కులు దున్నుతున్నారు.



రోలుగుంటలో ట్రాక్టరుతో దున్నుతున్న రైతు

ఘనంగా కొమరవోలు తల్లి పండగ



అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకోవడానికి వేచి ఉన్న భక్తులు

పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

రోలుగుంట: కొమరవోలులో గ్రామదేవత పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకొకసారి నిర్వహించే పండగకు ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన గ్రామస్తులు స్వగ్రామానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారి ఆలయం వద్ద గ్రామ వీధుల్లో విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. వేకువ జాము నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ గొర్లె రమణమ్మ, ఉప సర్పంచ్ బోళెం వెంటకలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద బాణసంచా కాల్చారు. అదేరోజు రాత్రి గ్రామ వీధుల్లో ఏర్పాటు చేసిన స్టేజ్‌లపై ఆర్కెస్ట్రా, సినీ డూప్ ఆరిస్టుల డ్యాన్స్, బుర్రకథ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ గొర్లె చెల్లంనాయుడు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

మంగళాపురంలో తీరిన లోవోల్టేజీ సమస్య

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



మంగళాపురంలో రెండో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న ఏఈ, సిబ్బంది

బుచ్చెయ్యపేట: మండలంలో శివారు పంచాయతీ మంగళాపురంలో విద్యుత్ లో వోల్టేజీ సమస్య పరిష్కారమైంది. ఇక్కడ శివాలయం వీధిలో 75 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ వీధిలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ లోడు సరిపోకపోవడంతో తరుచూ ఫ్యూజ్‌లు పోయి వైర్లు కాలిపోయి విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనిపై గ్రామ సర్పంచ్ కంటే వెంకట్ పద్మరేఖ ఇటీవల మండల సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో వడ్డాది విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ సోమరాజు తమ సిబ్బందితో గ్రామంలో లో వోల్టేజీ సమస్య ఉన్నట్లు గుర్తించారు. గురువారం శివాలయం దగ్గరలోనే రెండో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు విద్యుత్ శాఖ సిబ్బందికి, పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు



పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయాధికారి దమయంతి



కొత్తకోట గ్రంథాలయంలో శిబిరంలో చదువుకుంటున్న పిల్లలు



అవగాహన కల్పిస్తున్న దేవరాపల్లి గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు

నర్సీపట్నం: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంచుకోవచ్చనని గ్రంథాలయాధికారి పి.దమయంతి విద్యార్థులకు సూచించారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుస్తక పఠనంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, పుస్తకం చదవటం అలవాటుగా మల్చుకోవాలని సూచించారు. పిల్లలతో కథల పుస్తకాలు చదివించారు. ఉపాధ్యాయులు సిహెచ్. రాంకుమార్, సిహెచ్. భవాని పుస్తక పఠనం గురించి వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ విద్యార్థులతో రిక్రియేషన్ గేమ్ ఆడించి ఉత్సాహన్ని నింపారు.

కొత్తకోట శాఖా గ్రంథాలయంలో...

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు వరహామణి గురువారం తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ వరకూ ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ శిబిరానికి వచ్చిన విద్యార్థులకు పుస్తక పఠనం అలవర్చడంతోపాటు వారికి మంచి కథలు చెబుతామన్నారు. చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తామన్నారు. పలు అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.

దేవరాపల్లి శాఖా గ్రంథాలయంలో...

దేవరాపల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలబాలికలకు బాలబాలికలకు ఆట, పాటలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను గ్రంథాలయ అధికారి ఓ. శ్రీనివాసరావు చదివించి సమగ్రంగా వివరిస్తున్నారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞాన శిబిరాలను ఏటా నిర్వహిస్తామని తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం

చీడికాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభించినట్లు గ్రంథపాలకురాలు జోగేశ్వరి తెలిపారు. ఈ నెల 15 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేస్తామన్నారు.



చీడికాడ గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా వంతెన



సింగన్నదొరపాలెంలో రక్షణ గోడలు లేని వంతెన

కె.కోటపాడు: సింగన్నదొరపాలెం సమీపంలో మొండి గెడ్డపై వంతెన ప్రమాదకరంగా మారింది. 25 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు ప్రస్తుతం ఛిద్రమయ్యాయి. దాంతో ప్రయాణ సమయాల్లో ఎదురెదురుగా వాహనదారులు వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు. వంతెనకు ఇరువైపులా లోతట్టు ప్రాంతాలు ఉండటంతో కిందపడి వాహనదారులు తీవ్ర గాయాల బారిన పడుతున్నారు. వెంటనే రక్షణ గోడలు నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

వాకపల్లిలో 52 మందికి వైద్య పరీక్షలు

దేవరాపల్లి: మండలంలోని వాకపల్లిలో షిర్డీ సాయిబాబా మందిరం ఆవరణలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా వాకపల్లి, చీడిపల్లి తదితర గ్రామాలకు చెందిన 52 మంది రోగులకు చోడవరానికి చెందిన డాక్టరు వాసు వైద్య సేవలందించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరం నిర్వహణకు సాయిబాబా ఆలయ వ్యవస్థాపకుడు మళ్ల జగన్నాథరావు సహకారం అందించారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టరు వాసు

కూలీలకు గిట్టుబాటు వేతనం

మాకవరపాలెం: ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు గిట్టుబాటు వేతనాలు అందేలా పనులు చేయించాలని ఎంపీడీవో చంద్రరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పనుల ప్రగతిపై ఆరా తీశారు. కొన్ని చోట్ల కూలీలకు గిట్టుబాటు వేతనాలు అందకపోవడంపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. దినసరి వేతనం రూ.299 అందాల్సిందేనని, ఆ విధంగా పనులు చేయించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న సిబ్బంది

ద్రోణి ప్రభావంతో వర్షం



మాడుగుల రూరల్: ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కురుస్తున్న వర్షం

కె.కోటపాడు: మండలంలో గురువారం చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి నల్లని కారుమబ్బులు కమ్ముకుని వర్షం పడింది. రెండు నెలలుగా వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో

పంటలకు మేలు చేస్తుందని రైతుల ఆనందం

వాతావరణంలో వచ్చిన మార్పులతో వేసవి చివరిలో ముందస్తుగానే వర్షాలు కురవడంతో రైతులు, ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. వర్షాధారంగా సాగు చేసే రైతులకు ఖరీఫ్ ప్రారంభంలోనే వర్షాలు పడడంతో చెరకు, వేరుశనగ నాట్లుకు ఉపయోగకరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగుల రూరల్: ద్రోణి ప్రభావంతో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. దాంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షంతో రైతులు చెరకు దవ్వనాట్లు వేస్తున్నారు. దీంతోపాటు కూరగాయల పంటలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు.



కె.కోటపాడు: చెరకు నాట్లుకు మేలు చేస్తున్న వర్షం



కె.కోటపాడు: ఎ.భీమవరంలో చిరుజల్లులతో కూడిన వర్షం

ఉప్పు రైతులను ముంచిన అకాల వర్షం

పరవాడ : వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో సాగు చేస్తున్న ఉప్పుగల్లీలకు గురువారం తెల్లవారు జామున కురిసిన వర్షం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామంలో 150 ఎకరాల ఉప్పు పంట సాగవుతోంది. మడుల్లో పండిన ఉప్పును తీసి గట్లపై వేసి ఆ తర్వాత పాకల్లో నిల్వ చేద్దామనుకున్న తరుణంలో ఉన్నట్టుండి రాత్రి కుండపోతగా కురిసిన వర్షానికి ఉప్పు కరిగిపోయి నీటిపాలైందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వర్షం వెలిసిన తర్వాత వెళ్లి చూసి రైతులు కంట తడిపెట్టుకున్నారు. రూ. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పండించిన ఉప్పు వర్షానికి నీటి పాలైందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన ఉప్పుకు సరైన గిట్టుబాటు ధర లేక ఇప్పటికే నానా అవస్థలు పడుతున్న తరుణంలో ఆకాల వర్షాలు తీరని నష్టం తెచ్చిపెట్టాయని రైతులు వాపోతున్నారు. తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఉప్పు రైతులు కోరుతున్నారు.